## పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

కామారెడ్డి, మే 15 : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో గురువారం నెల వారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేశ్‌చంద్ర పోలీసు అధికారులతో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి కేసులో వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలన్నారు. బాధితులకు త్వరగా న్యాయం అందించాలని సూచించారు. సైబర్ మోసాలపై ప్రజల్లో ఎప్పటికప్పుడూ అవగాహన కల్పించాలని చెప్పారు. గంజాయి, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు పెంచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా విజిబుల్ పోలీసింగ్ కొనసాగించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్య, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోచారం వద్ద చెక్‌పోస్ట్ ప్రారంభం



పోచారం చెక్‌పోస్ట్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్(నాగిరెడ్డిపేట్), మే 15 : బక్రీద్ సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పోచారం వద్ద తాత్కాలిక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దులో పోచారం వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. జూన్ 6వ తేదీన బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, ఎద్దులు, బర్రెలను తరలించకుండా ఉండేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. బక్రీద్ పండుగ వరకు పోచారం వద్ద చెక్‌పోస్ట్ ఉంటుందన్నారు. బక్రీద్ వరకు ఎవరైనా అక్రమంగా పశువులను తరలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

## నేడు చుక్కాపూర్‌లో ఇసుక వేలం

మాచారెడ్డి, మే 15 : మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో ఇటీవల సీజ్ చేసిన ఇసుకకు శుక్రవారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్వేత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.పదివేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. దాదాపు ఏడు ట్రాక్టర్ల ఇసుక ను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు శుక్రవారం 12 గంటలకు చుక్కాపూర్‌లో నిర్వహించే వేలంలో పాల్గొనాలని సూచించారు.

# ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- కొనుగోలు కేంద్రాల పరిశీలన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రామారెడ్డి(సదాశివనగర్), మే 15 : రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. అడ్లూర్ ఎల్లారెడ్డి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులతో మాట్లాడి ధాన్యం తూకం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే తూకం వేయాలని పీపీసీ ఇన్‌చార్జిలకు సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నందునా ధాన్యాన్ని త్వరగా తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని చెప్పారు. రైతులను ముందుగానే అప్రమత్తం చేసి ధాన్యం కుప్పలను వర్షం నుంచి కాపాడేందుకు టార్పాలిన్లు కప్పేల చర్యలు తీసుకోవాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు.

తూకం వేసిన ధాన్యం బస్తాలను వర్షా ల బారి నుంచి కాపాడేలా భద్రపరచాలని నిర్వాహకులకు సూచించారు. త్వరగా ట్యాబ్‌లో రైతుల వివరాలు నమోదు చేసి వారి ఖాతాలో డబ్బులు డబ్బులు జమ అయ్యేలా చ ర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి రాంమోహన్, మర్రి సదాశివరెడ్డి, మానిటరింగ్ అధికారి సాయిలు, ఏఈవో కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

**డీలర్లందరూ ఎల్ వన్ ఈపీవోఎస్ మిషన్లను వాడాలి..**

కామారెడ్డి, మే 15 : జిల్లాలోని 360 మంది ఎరువుల విక్రయదారులకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ గురువారం ఎల్‌వన్ ఈపీవోఎస్ మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డీలర్లందరూ ఎల్‌వన్ ఈపీవోస్ మిషన్లను వాడాలని సూచించారు. డీలర్లందరూ ఈ మిషన్లను వాడాలని, వాటికి ఆధార్ అనుసంధానం చేసుకొని ఎరువులను విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, జిల్లాలోని ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానల సందర్శన



పోల్కంపేటలోని పల్లె దవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

లింగంపేట, మే 15 : మండలంలోని పోల్కంపేట, మోతె గ్రామాల్లోని పల్లె దవాఖానలను కేంద్ర బృందం అధికారులు గురువారం సందర్శించారు. పల్లె దవాఖానల్లో ప్రజారోగ్య సేవలు, నాణ్యతా ప్రమాణాలు పెంపొందించడంతోపాటు ఉత్తమ సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీక్యూమాస్ రాధిక, డీపీవో పద్మజ, జహీరా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రాంబాయి, సీహెచ్‌వో రమేశ్, సిబ్బంది ఫరీదా, యాదగిరి, గణేశ్, రాజేశ్వరి, ఎలిజబెత్, విజయ కుమారి, రజనితోపాటు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు జాబ్ మేళా

కామారెడ్డి, మే 15 : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కలెక్టరేట్‌లోని రూం నంబర్ 121లో ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని ప్రముఖ వరుణ్ మోటర్స్‌లో రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుకు ఈ నెల 17వ తేదీ శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. డిగ్రీ, మెకానికల్ ఇంజినీర్, బీటెక్, డిప్లొమా ఉండాలని తెలిపారు. 18 నుంచి 30 ఏండ్ల వయస్సు యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885453222, 7671974009 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## చిన్నపాటి వర్షానికే చెరువైంది..



వర్షపునీటితో నిండిన ఎల్లారెడ్డి బీసీ కాలనీ పరిస్థితి

ఎల్లారెడ్డి రూరల్, మే 15 : పట్టణంలోని బీసీ కాలనీ గురువారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికి చెరువును తలపిస్తోంది. వర్షపు నీరు పోవడానికి మురికి కాలువల నిర్మాణాలు సరిగ్గా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి ఇండ్లలోకి వస్తున్నదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలంలో పడిన చిన్న వర్షానికే తమ పరిస్థితి ఇలా ఉంటే వచ్చే వర్షాకాలంలో ఇండ్లలో ఉండే పరిస్థితి ఉండదేమోనని, ఇండ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి వస్తుందేమోనని కాలనీవాసులు అంటున్నారు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు తెలుపగా బీసీ కాలనీ పరిస్థితిని గమనించిన మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ వర్షపు నీరు నిలువకుండా, ఇండ్లలోకి రాకుండా త్వరలోనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వానకాలం ప్రారంభానికి తమసమస్యకు పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి





సోమార్‌పేట్, తిర్మలాపూర్‌లో రైతుల వివరాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు ముఖీద్, రాణి

ఎల్లారెడ్డి రూరల్/బాన్సువాడ రూరల్, మే 15 : రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ విస్తీర్ణాధికారి ముఖీద్ సూచించారు. గురువారం ఆయన ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేట్‌లో గ్రామస్తులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు సంబంధించిన ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమతోపాటుగా ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్, పట్టా పాస్ బుక్‌ను తీసుకొని రావాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. బాన్సువాడ మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో గురువారం ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్లు చేపట్టినట్లు ఏఈవో రాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ ఐడీల జారీ కోసం రైతుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేస్తున్నామని తెలిపారు. 11 నంబర్లతో కూడిన ఫార్మర్ ఐడీ ఉంటేనే భవిష్యత్‌లో కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమాయోజన, హెల్త్‌కార్డులకు అర్హులు అవుతారని తెలిపారు. బోర్లం క్లస్టర్ పరిధిలోని బోర్లం, తిర్మలాపూర్, తాడ్కోల్, బోర్లం క్యాంపు, కొయ్యగుట్ట, జక్కత్‌దాని తండా, బుడ్మి, కొత్తాబాది గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

రామారెడ్డి(గాంధారి), మే 15 : గాంధారి మండలం సర్వాపూర్ గండివేట్ తండాలో తేజావత్ రూప్లా నాయక్‌కు చెందిన గేదె విద్యుత్‌షాక్‌తో బుధవారం మృతి చెందింది. రైతు పొలంలో మేత మేస్తుండగా తెగిపడిన సర్వీస్ వైరు గేదెకు తగలడంతో మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని, విద్యుత్ శాఖ నుంచి పరిహారం ఇప్పించాలని బాధితుడు అధికారులను కోరుతున్నాడు.

## అంగన్‌వాడీ సెంటర్‌లో కంటి పరీక్షలు



చిన్నారులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్ట్ హరికిషన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, మే 15 : మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గురువారం కంటి పరీక్షలను నిర్వహించినట్లు ఆప్తాలమిస్ట్ హరికిషన్‌రావు తెలిపారు. 52 మంది చిన్నారులను పరీక్షించి కంటి సమస్యలు ఉన్న వారికి అక్కడికక్కడే మందులను అందజేశారు. ఆయనతోపాటు ఆర్‌బీఎస్‌కే డాక్టర్ సంజీవ్‌కుమార్, ఫార్మాసిస్ట్ రవితేజ, ఏఎన్‌ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరులున్నారు.

## ధాన్యం తూకంలో వేగం పెంచాలి



గండిమాసానిపేట్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సొసైటీ చైర్మన్ నర్సింహులు

ఎల్లారెడ్డి రూరల్, మే 15: ధాన్యం తూకంలో వేగం పెంచాలని ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు అన్నారు. గండిమాసానిపేట్ కొనుగోలు కేంద్రంలో మరో కాంటా, హమాలీ బృందాన్ని పెంచినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలోని గండిమాసానిపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన డీటీ, సొసైటీ సీఈవో విశ్వనాథంతో కలిసి పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున కేంద్రంలోని ధాన్యాన్ని త్వరగా తూకం చేయడాలనే ఉద్దేశంతో రెండు కాంటాలను, రెండు హమాలీ బృందాలతో పని చేయిస్తున్నామన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేయించి రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, అకస్మాత్తుగా వర్షం పడితే వెంటనే టార్పాలిన్లును కప్పి ధాన్యం తడవకుండా చూసుకోవాలని రైతులకు సలహానిచ్చారు. ఆయన వెంట సిబ్బంది, రైతులు ఉన్నారు.

## అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

రాజంపేట్, మే 15 : ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని, ఈ ఎంపికలో ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. రాజంపేటలోని శ్రీలక్ష్మీనరసింహ ఫంక్షన్‌హాలులో కామారెడ్డి నియోజక వర్గ పరిధిలోని నాయకులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యాదవరెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులతో పంటలసాగు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్

లింగంపేట, మే 15 : సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. లింగంపేట మండలం మోతె గ్రామంలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో కలిసి గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ.. రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగించి పంటలు సాగు చేయడంతో భూమిలో సారం తగ్గుతుందని వెల్లడించారు. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు సాగు చేయడంతో ఖర్చులు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూ సారాన్ని కాపాడవచ్చని సూచించారు. ఒకే రకమైన పంటలు సాగు చేయడకుండా పంటమార్పిడి విధానం అవలంబించాలని చెప్పారు. భూసార పరీక్షలు నిర్వహించుకుని ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో కచ్చితంగా రసీదులు తీసుకోవాలన్నారు. నాణ్యతలేని విత్తనాల కారణంగా పంట నష్టపోతే పరిహారం పొందడానికి వీలు ఉంటుందన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి రైతూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో నల్లమడుగు సహకార సంఘం చైర్మన్ రమేశ్, ప్రిన్సిపాల్ కార్యదర్శి డాక్టర్ అంజయ్య, డాక్టర్ భాస్కరన్, స్థానిక పశువైద్యాధికారి హేనా, ఎల్లారెడ్డి ఏడీ రత్నం, మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్, జ్యోతి, అనిల్‌రెడ్డి, రేవంత్‌నాథన్‌తోపాటు మోతె చెందిన రైతులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు ప్రారంభం



శెట్పల్లిలో ఇందిరమ్మ గృహానికి మార్కింగ్ చేసి మంజూరు పత్రం అందజేస్తున్న ఎంపీడీవో ప్రకాశ్

ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట, మే 15 : ఎల్లారెడ్డి మండలంలోని అడ్విలింగాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు గురువారం ముగ్గు పోసి పనులు ప్రారంభించినట్లు ఎంపీడీవో ప్రకాశ్ తెలిపారు. గ్రామానికి 18 ఇండ్లు మంజూరు కాగా 14 ఇండ్ల నిర్మాణానికి ప్రొసీడింగ్‌లు వచ్చాయన్నారు. మిగతా ఇండ్ల పనులను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు పంచాయతీ సెక్రటరీ శంకరయ్య, లబ్ధిదారులు ఉన్నారు.

లింగంపేట మండలం శెట్పల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి అధికారులు మార్కింగ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలు మంజూరు చేశారు. గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించి, నిర్మాణం కోసం మార్కింగ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, మల్లయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

## కొడుకుపై తండ్రి కత్తితో దాడి

లింగంపేట, మే 15 : మద్యం మత్తులో కన్న కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన లింగంపేట మండలం కోమట్‌పల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంగయ్య మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో ఘర్షణ పడ్డాడు. అదే సమయంలో కుమారులు అడ్డుకోవడంతో మత్తులో ఉన్న సంగయ్య పెద్ద కుమారుడు సాయికుమార్‌పై కత్తితో దాడి చేశాడు. దీంతో సాయికుమార్‌కు వీపు, మెడ భాగంలో తీవ్ర గాయాలు కావడంతో మండల కేంద్రంలోని ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. సంగయ్య కొంత కాలంగా జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి ఇటీవల వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న తండ్రి కుమారులతో ఘర్షణ పడి కత్తితో దాడి చేసినట్లు తెలిపారు.

## సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ




సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సివిల్ సప్లయీస్ కార్మికులు

కామారెడ్డి, మే 15 : ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సివిల్ సప్లయీస్ కార్మికుల ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దశరథ్, అధ్యక్షుడు పి.బాలరాజ్, కార్యదర్శి కె.బాలరాజ్, కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, ప్రవీణ్, ఎండీ రఫీక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I, Gadam Bhumaiah S/o. Gaddam Gangaram (Old name) R/o. H.No.8-6, Yergatla Vill. & Mdl, Dist. Nizamabad. Changed my name as **Gaddam Bhumanna S/o. Gaddam Gangaram (New name)**
NTZ- 338443

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# గ్రంథాలయాలకు ఫర్నిచర్ వితరణ



తాడ్వాయిలోని గ్రంథాలయానికి ఫర్నిచర్ అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది



ఎల్లారెడ్డిలోని శాఖ గ్రంథాలయానికి వచ్చిన పుస్తకాలు, సామగ్రి

లింగంపేట(తాడ్వాయి), మే 15 : తాడ్వాయి మండల కేంద్రంలోని గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ వారు ఫర్నిచర్ అందించినట్లు ఇన్‌చార్జి గ్రంథపాలకుడు రాజలింగం తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి దాతల సహకారంతో గ్రంథాలయానికి రీడింగ్ ప్యాడ్స్, కుర్చీలు, రైటింగ్ ప్యాడ్స్ అందించినట్లు ఆయన తెలిపారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను త్వరలో అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, స్థానిక యువకులు పాల్గొన్నారు.

**పుస్తక సామగ్రి..**

ఎల్లారెడ్డి రూరల్, మే 15: ఎల్లారెడ్డి పట్టణంలో శాఖా గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి పుస్తక సామగ్రి వచ్చినట్లు ఎల్లారెడ్డి గ్రంథపాలకుడు జాకీర్ గురువారం తెలిపారు. జిల్లా గ్రంథాయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్.. దాతల సహకారంతో ఎల్లారెడ్డి గ్రంథాలయానికి 15 కుర్చీలు, ఐదు రేటింగ్ చైర్స్, 15 స్టడీ ప్యాడ్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను పంపినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# వెంకంపల్లిని సందర్శించిన డీఎల్పీవో



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్పీవో సురేందర్

నాగిరెడ్డిపేట, మే 15 : మండలంలోని వెంకంపల్లి గ్రామాన్ని డీఎల్పీవో సురేందర్ గురువారం సందర్శించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరిగి మురుగు కాలువలు, తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడూ చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రజితకు సూచించారు. ఇందిరమ్మ పథకంలో ఎంపికైన లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు.

## యువ కవికి సన్మానం

రామారెడ్డి, మే 15 : రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామానికి చెందిన యువ కవి బుర్ర శరత్‌గౌడ్‌ను తెలంగాణ సాహిత్య అకాడమీ సంస్థ నిర్వాహకులు లలిత కళ వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. శరత్‌గౌడ్ స్ఫూర్తినిచ్చేలా కవితను రాశాడు. ఇందుకుగాను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ తల్లి రూపకర్త బీవీఆర్‌చారి, త్రిభాష కవయిత్రి శోభ దేశ్‌పాండే, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నళేశ్వరం శంకర్ శరత్‌గౌడ్‌ను అభినందించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న ఉపాధ్యాయుడు

లింగంపేట, మే 15 : నిత్యం యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని యోగా శిక్షకుడు నర్సింహులు విద్యార్థులకు సూచించారు. లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతోపాటు ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. నిత్యం అరగంటపాటు యోగాసనాలు వేయడం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.